RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 198 | ఆగస్టు 18 మంగళవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 198 | August 18 Tuesday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం

2

# ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం టీజీసేఫ్

## ఏకీకృత వ్యవస్థను అమల్లోకి తెచ్చిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ జనసంఘర్షణ**
రాష్ట్ర ప్రజల భద్రత, రక్షణ మరియు సంక్షేమానికి తమ ప్రజా ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమాజంలోని ప్రతి రంగంలోనూ చట్టబద్ధమైన పాలన అందిస్తూ, పరిపాలనలో సంపూర్ణ జవాబుదారీతనం నెలకొల్పడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ దిశగా ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఆహార పదార్థాలు, నిత్యావసర ఔషధాల నాణ్యతను పర్యవేక్షించేందుకు ఏకీకృత వ్యవస్థగా టీజీసేఫ్ స్టాండర్డ్స్ అథపరిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్)ను అమల్లోకి తీసుకువచ్చినట్లు సోషల్ మీడియా వేదిక ద్వారా వెల్లడించారు. ఇప్పటివరకు వేర్వేరుగా విధులు నిర్వహిస్తున్న ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ), ఔషధ నియంత్రణ (డ్రగ్స్ కంట్రోల్) విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నూతన అథారిటీ ద్వారా మార్కెట్‌లో లభించే ఆహార పదార్థాల్లో కల్తీని

➤ మిగతా 2వ పేజిలో..

# బీహార్ అశోక్‌ధామ్ ఆలయంలో తొక్కిసలాట

## ఏడుగురు భక్తులు మృతి



**పాట్నా జనసంఘర్షణ**
బీహార్‌లోని లఖిసరాయ్ జిల్లాలో ఉన్న ప్రముఖ అశోక్‌ధామ్ శివాలయంలో సోమవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. క్యూలైన్లలో ఉన్న సమయంలో ఉన్నట్టుండి ఒక విద్యుత్ వైరు తెగిపడటంతో తీవ్ర భయాందోళనలు వ్యక్తమయ్యాయి. కరెంట్ షాక్ తగులుతుందేమోనన్న భయంతో భక్తులు ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. ఈ క్రమంలో అక్కడ ఒక్కసారిగా

# తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ జనసంఘర్షణ:**
బీహార్‌లోని లఖిసరాయ్ జిల్లా అశోక్‌ధామ్ ఆలయం వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రావణ మాసం వేళ జలాభిషేకం కోసం వచ్చిన భక్తులు ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన చెందారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేశారు. బాధితులకు స్థానిక యంత్రాంగం

➤ మిగతా 2వ పేజిలో..

# హైదరాబాద్‌లో దృష్టి మళ్లించి దొంగతనాలు

## ఆరుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేసిన లంగర్‌హౌస్ పోలీసులు

**హైదరాబాద్ జనసంఘర్షణ :** నగరంలో అమాయకుల దృష్టి మళ్లించి వరుస బంగారు ఆభరణాల చోరీలకు పాల్పడుతున్న ఘరానా ముఠా గుట్టును లంగర్‌హౌస్ పోలీసులు రట్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి భారీగా బంగారు ఆభరణాలు, నగదు, వాహనాలు మరియు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని, వారి దృష్టి మళ్లించి విలువైన వస్తువులు మరియు బంగారు నగల అపహరణకు పాల్పడుతున్నట్లు ఆధారాలు లభించాయి. నగరంలో వరుసగా జరుగుతున్న ఈ దొంగతనాలపై రంగంలోకి దిగిన లంగర్‌హౌస్ పోలీసులు, ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిందితుల కదలికలను సీసీ కెమెరాల

➤ మిగతా 2వ పేజిలో..

# తారాపీఠ్ హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం

## ఏడుగురు భక్తులు దుర్మరణం

**కలకత్తా జనసంఘర్షణ**
పశ్చిమ బెంగాల్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం తారాపీఠ్‌లో సోమవారం తెల్లవారుజామున విషాదం చోటుచేసుకుంది. బీర్‌భూమ్ జిల్లా పరిధిలోని ఓ నాలుగు అంతస్తుల హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించి ఏడుగురు భక్తులు సజీవ దహనమయ్యారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉండటంతో పాటు పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కాళీమాత దర్శనం కోసం వచ్చిన భక్తులు ప్రగాఢ నిద్రలో

➤ మిగతా 2వ పేజిలో..

# కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు కొనసాగుతాయి

## హైకోర్టు ఉత్తర్వులపై అప్పీల్ కు వెళ్తాం - మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి




**హైదరాబాద్ జనసంఘర్షణ:**
తెలంగాణ రాష్ట్రంలో పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆసరాగా నిలుస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ సంక్షేమ పథకాలను నిరంతరాయంగా కొనసాగిస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. సెక్రటేరియట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. హైకోర్టు ఇటీవల ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులపై ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించి, స్టేను తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో జారీ చేసిన లోపభూయిష్టమైన జీవోల వల్లే ప్రస్తుతం న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నమయ్యాయని, ఆ తప్పులను సరిదిద్ది పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాలకు గ్రీన్ ఛానెల్ ద్వారా సకాలంలో నిధులు విడుదల చేస్తోందని, అర్హులైన లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూస్తున్నామని పేర్కొన్నారు. కోర్టులో విచారణ అంశంపై కౌంటర్ ఫైల్ చేయడంలో అధికారుల లేదా నిపుణుల వైఫల్యం ఉందా అనే అంశంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విపక్షాలు దీనిపై ధర్నాలు చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం మొసలి కన్నీరు కారుస్తున్నాయని మండిపడ్డారు. ఇదిలా ఉండగా, బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆవిష్కరిస్తారని మంత్రి పొన్నం తెలిపారు. ఇటీవల మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రీబాయి

➤ మిగతా 2వ పేజిలో..

# ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం టీజీసేఫ్

**మొదటిపేజీ తరువాయి..** అరికట్టడంతో పాటు నకిలీ, ప్రమాదకర ఔషధాల విక్రయాలకు స్వస్తి పలకడం సాధ్యమవుతుందని సీఎం తెలిపారు. క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు చేపట్టి, నాణ్యతా ప్రమాణాలు ఉల్లంఘించే వారిపై తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకునేలా అధికార యంత్రాంగాన్ని పటిష్టం చేశామని వివరించారు. ఈ క్రమంలోనే టీజీసేఫ్ తొలి కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతి బాధ్యతలు స్వీకరించారు. నాణ్యమైన ఆహారం, సురక్షితమైన ఔషధాలు అందించడమే ధ్యేయంగా పనిచేసే ఈ టీజీసేఫ్ సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని, ఆరోగ్యవంతమైన, సురక్షిత తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

## తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

**మొదటిపేజీ తరువాయి..** అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తోందని ప్రధాని పేర్కొన్నారు. మరోవైపు ఈ దుర్ఘటనపై లఖిసరాయ్ జిల్లా మేజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ పూర్తి వివరాలను వెల్లడించారు. శ్రావణ సోమవారం సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉందని, మహిళలు, పురుషుల కోసం వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే పురుషుల క్యూలైన్ సమీపంలో ఉన్న ఒక విద్యుత్ స్తంభం అకస్మాత్తుగా కూలిపోవడంతో ఈ ప్రమాదం మొదలైంది. అది కేవలం కేబుల్ వైర్ అయినప్పటికీ, విద్యుత్ వైరు తెగిపడిందనే పుకారు క్షణాల్లో వ్యాపించడంతో భక్తులు భయాందోళనతో పరుగులు తీశారు.

కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే పరిస్థితి అదుపుతప్పి ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, 12 మందికి పైగా గాయపడ్డారని అధికారులు ధ్రువీకరించారు. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం సదర్ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబాలకు బీహార్ ప్రభుత్వం రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. ప్రమాదంలో మరణించిన, గాయపడిన వారి పూర్తి ?ెలను అధికారులు సేకరిస్తున్నారు.

## ప్రతిపక్షహోదా కోసం మారాం చేస్తున్న వైకాపా

**మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఎద్దేవా**

**అమరావతి :** 'పాఠాలు చెప్తాం.. గుణపాఠాలు కూడా నేర్పుతాం' అంటూ టీచర్లు చేస్తున్న ర్యాలీలను గొడ్డలి పార్టీ గుర్తు పెట్టుకోవాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సోమవారంఅసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. గిరిజనులను గొడ్డలి పార్టీ నాయకులు రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. చిన్నపిల్లలకు చాక్లెట్ ఇవ్వకపోతే మారాం చేస్తున్నట్టు ప్రతిపక్ష హోదా ఇస్తే వస్తామని అనడం హాస్యాస్పదమన్నారు. 1/70 యాక్ట్.. అంటే గిరిజనుల భూ సంరక్షణ చట్టం రద్దు అవుతుందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని.. గిరిజనుల భూములు, హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని చెప్పుకొచ్చారు. ఈ విషయంలో గిరిజనులు ఏమాత్రం భయపడవద్దన్నారు. గిరిజనులను మభ్యపెట్టి, భయపెట్టి అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఐటీడీఏ ఆపేసి, 18 పథకాలను నిలుపుదల చేశారని తెలిపారు. గురివిందకు తన తప్పు ఎరుగదు అన్నట్టు వైసీపీ నేతల తీరు ఉందని విమర్శించారు. జీవో నం 3 రద్దు చేస్తే అప్పుడు సీఎంగా జగన్ ఏం చేశారని ప్రశ్నించారు. ఆయన తాడేపల్లిలో ఉంటాడో బెంగళూరులో ఉంటాడో ఎవరికీ తెలియదంటూ మంత్రి గుమ్మడి సంధ్యారాణి వ్యాఖ్యానించారు.

# వర్షాభావం వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

**ఏలూరు, ఆగస్టు 17 :** వర్షాభావం వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, డాక్టర్ ఎమ్ ఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అనుసరించి అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించి, చట్టబద్ధత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి రాయాంకుల లక్ష్మణరావు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మరియు కౌలు రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మార్పు రావాలి మార్పు కోరాలి అనే కార్యక్రమం సందర్భంగా రెండు సంఘాల ఏలూరు జిల్లా సమితుల ఆధ్వర్యంలో సోమవారం నాడు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించడం జరిగింది. ధర్నా కార్యక్రమానికి ఏపీ కౌలు రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ను వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వలె మన రాష్ట్రంలో కూడా 2 లక్షల రూపాయల వరకు రైతుల రుణాలను మాఫీ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పెరిగిన సాగు ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు ఇవ్వాలని, ఎలాంటి హామీలు లేకుండా కౌలు రైతులకు ఆర్బిఐ నిబంధనల ప్రకారం రెండు లక్షల వరకు పంట రుణాలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. పకృతి వైపరీత్యాలు వల్ల నష్టపోయిన రైతులకు గత మూడు సంవత్సరాల పంటల బీమా పరిహారం బకాయిల సుమారు 4400 కోట్లను వెంటనే చెల్లించాలని, ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని వారు విజ్ఞప్తి చేశారు. వర్షాభావం వల్ల నష్టపోయిన రైతులకు గత రెండేళ్ల ఇన్పుట్ సబ్సిడీ బకాయిలు 1200 కోట్ల రూపాయలు తక్షణమే విడుదల చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, రైతులకు ఇస్తున్న అన్ని రైతులు కౌలు రైతులకు వర్తింపచేయాలని వారు కోరారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు రైతులందరికీ సబ్సిడీ కి అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. మొత్తం 25 డిమాండ్లతో వినతి పత్రాన్ని నాయకులు కలెక్టర్ కు సమర్పించారు. రైతుల ధర్నా కార్యక్రమానికి ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే, రైతు మరియు కౌలు రైతు సంఘాల నాయకులు కె. ఆనందరావు, కూచిపూడి నాగేశ్వరరావు, పంతగాని తిరుపతిరావు, మల్లిపూడి రంగారావు, ఎస్ నాగార్జున రావు, కే రామకృష్ణ, చందమాల వెంకటరత్నం, మేటకట్ల అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు కొనసాగుతాయి

**మొదటిపేజీ తరువాయి..**పూలే విగ్రహాలను ఆవిష్కరించిన తరహాలోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ చారిత్రాత్మక ఘట్టంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, బీసీ, బహుజన వర్గాల నాయకులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# హైదరాబాద్‌లో దృష్టి మళ్లించి దొంగతనాలు

**మొదటిపేజీ తరువాయి..** ఆధారంగా పక్కాగా గుర్తించిన పోలీసులు, సయ్యద్ అసద్, ఒమర్ ఖాన్, సయ్యద్ మొయిన్, అజర్ హుస్సేన్, మహమ్మద్ ఇబ్రహీం, సయ్యద్ అబ్దుల్ మజీద్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా తమ నేరాలను అంగీకరించారు. అరెస్టైన నిందితుల్లో కొందరిపై గతంలోనే పలు పోలీస్ స్టేషన్లలో రౌడీషీటర్ కేసులు కూడా నమోదై ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడుల్లో నిందితుల నుంచి సుమారు 13.5 తులాల విలువైన బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 4 బంగారు గాజులు, 3 గొలుసులు, ఒక లాకెట్, 3 ఉంగరాలు ఉన్నాయి. వీటితో పాటు రూ. 7.40 లక్షల నగదును, చోరీలకు ఉపయోగించిన ఒక ఆటో, బైక్ మరియు 6 సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. ముఠాను చాకచక్యంగా పట్టుకున్న లంగర్‌హౌస్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

# బీహార్ అశోక్‌ధామ్ ఆలయంలో తొక్కిసలాట

**మొదటిపేజీ తరువాయి..** తొక్కిసలాట జరిగింది. జనాల ఒత్తిడికి బారికేడ్లు విరిగిపడటంతో భక్తులు ఒకరిపై ఒకరు పడిపోయారు. ఈ ఘటనలో ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. ఆలయ ప్రమాదంపై ఉప ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించడంతో పాటు, మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షల పరిహారం ప్రకటించారు. ఈ ఘటనపై విచారణ వేగవంతం చేశామని, విద్యుత్ వైరు తెగిపడటమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నప్పటికీ పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని జిల్లా మేజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ తెలిపారు.

## ఎపి అభివృద్ధి గమ్యానికి కొత్తరెక్కలు

**తొలి విమానం ప్రారంభంపై డిప్యూటి సిఎం హర్షం**

**అమరావతి, ఆగస్ట్17 :** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి గమ్యానికి కొత్త రెక్కలు తొడుగుతూ భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానసేవలు ప్రారంభం కావడం ఎంతో ఆనందదాయకమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. హైదరాబాద్ నుంచి వచ్చిన ఇండిగో విమానం విజయవంతంగా ల్యాండ్ కావడంతో రాష్ట్ర ప్రగతి చరిత్రలో ఒక అద్భుత ఘట్టంగా ఆవిష్కృతమైందని తెలిపారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరుతో నిర్మితమైన ఈ అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం రవాణా సౌకర్యాల విస్తరణ మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల ఆకాంక్షలకు నిలువెత్తు రూపమని చెప్పుకొచ్చారు.

ఈ విమానాశ్రయం మూలంగా కొత్త పెట్టుబడులు, పారిశ్రామిక అవకాశాలు మెరుగుపడి, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మరింత విస్తరించాలని పవన్ కోరుకున్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇది శాశ్వత మైలురాయిగా నిలిచిపోతుందని అన్నారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల్లో ఒకటిగా ఎదిగి, ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి సేవలు అందిస్తూ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ ఎక్స్‌లో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

# తారాపీఠ్ హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం

**మొదటిపేజీ తరువాయి..** ఉన్న సమయంలో, తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది.

గ్రౌండ్ ఫ్లోర్‌లోని రిసెప్షన్ సమీపంలో ఉన్న ఏసీ యూనిట్‌లో సంభవించిన సాంకేతిక లోపమే ఈ మంటలకు ప్రాథమిక కారణంగా భావిస్తున్నారు. రిసెప్షన్‌లో మొదలైన మంటలు క్షణాల్లోనే భవనమంతటికీ వ్యాపించాయి. దట్టమైన పొగ భవనాన్ని కమ్మేయడంతో లోపల ఉన్నవారు ఊపిరాడక తీవ్ర అవస్థలు పడ్డారు. బయటకు వచ్చే దారి కూడా సరిగ్గా కనిపించకపోవడంతో భయాందోళనకు గురైన అతిథులు లోపలే చిక్కుకుపోయారు.

ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న సహాయక బృందాలు స్థానికులతో కలిసి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను అదుపు చేసి, చిక్కుకున్న వారిని వెలికితీశారు. క్షతగాత్రులను వెంటనే రాంపూర్ హాట్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. హోటల్‌లో కనీస అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పాటించలేదని, ప్రమాద సమయంలో ఫైర్ అలారం కూడా పనిచేయలేదని ప్రాథమిక తనిఖీల్లో తేలింది. భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన హోటల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

## నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం

**22 ఏ భూములపై ఆందోళన వద్దు**

**మంత్రి పొంగులేటి క్షమాపణలు**




**హైదరాబాద్ :** ప్రైవేటు వ్యక్తుల ఆస్తులకు ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, 22ఏ నిషేధిత జాబితాలో చేరిన ప్రైవేటు భూములను త్వరలోనే తొలగిస్తామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల అధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ఈ అంశంపై చర్చించినట్లు తెలిపారు. గతంలో ఈ భూములు యూఎల్‌సీ (ఖుజ) పరిధిలో ఉండేవని, కోర్టు ఆదేశాలను అధికారులు ఆన్‌లైన్ నివేదికల్లో సరిగా అప్‌డేట్ చేయకపోవడం వల్లనే ఈ పొరపాటు జరిగిందని వివరించారు. అధికారుల తప్పిదం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు ప్రభుత్వం తరఫున మంత్రి క్షమాపణలు తెలియజేశారు.

ఈ 22 ఏ సమస్యపై ఇప్పటివరకు నాలుగు జిల్లాల నుంచి మొత్తం 757 దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి వెల్లడించారు. వీటిలో అత్యధికంగా మేడ్చల్ జిల్లా నుంచి 511, రంగారెడ్డి నుంచి 146, హైదరాబాద్ నుంచి 49 మరియు సంగారెడ్డి జిల్లా నుంచి 38 దరఖాస్తులు నమోదయ్యాయి. ఈ దరఖాస్తులన్నింటినీ వేగంగా విచారించి పరిష్కరించేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బాధితులు కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, క్రమబద్ధంగా ఉన్న ఆస్తులకు వెంటనే క్లియరెన్స్ ఇస్తామని హామీ ఇచ్చారు. కాగా, ఈ సమస్యను బూచిగా చూపి ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకునే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధితులు తమ ఫిర్యాదులు, సందేహాల నివృత్తి కోసం ప్రభుత్వం కేటాయించిన టోల్‌ఫ్రీ నంబర్ 1800-599-4788 కు సంప్రదించాలని మంత్రి పొంగులేటి కోరారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



# గంజాయి తరలిస్తున్న కేటుగాళ్లను పట్టుకోవడం పోలీసుల పనితీరైతే..

- గంజాయి తరలిస్తున్న పోలీసులను పట్టుకున్న ప్రజలు!





అద్దంకి/ఆగస్టు 17/జన సంఘర్షణ

అద్దంకి: గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన పోలీసు అధికారులే గంజాయి, మద్యం తరలిస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. అద్దంకి సమీపంలో బల్లికురవ ఎస్సై నాగరాజు, సంతమాగులూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు ప్రయాణిస్తున్న కారు ఆటోను ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. ప్రమాదం అనంతరం కారును.. పరిశీలించేందుకు ప్రయత్నించగా, కారు డిక్కీలో గంజాయి, మద్యం, పోలీస్ యూనిఫామ్ ఉన్నట్లు స్థానికులు గుర్తించినట్లు సమాచారం. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ సుబ్బరాజు కారు డిక్కీ తెరవకుండా అడ్డుకున్నారని స్థానికులు ఆరోపించారు. దీంతో ఆగ్రహించిన ప్రజలు సీఐతో వాగ్వాదానికి దిగుతూ.. "చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులకే ఒక న్యాయం.. సామాన్య ప్రజలకు మరో న్యాయమా?" అంటూ ప్రశ్నించారు. అక్రమంగా గంజాయి తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసు అధికారులేలిఇలాంటి ఆరోపణల్లో చిక్కుకోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని, తప్పు చేసిన వారు ఎంతటి స్థాయిలో ఉన్నా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. "అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో గంజాయిని నిర్మూలిస్తామని చెప్పిన ప్రభుత్వం.. గంజాయి అక్రమ రవాణా ఆరోపణల్లో పోలీసుల పేర్లు వినిపిస్తున్న ఈ ఘటనపై ఏం సమాధానం చెబుతుంది?" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**అధికారులకు హెచ్చరిక....**

చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉన్న అధికారులు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు రావడం అత్యంత తీవ్రమైన విషయం. ఇలాంటి ఘటనలు పోలీసు వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తాయి. నిజానిజాలను నిష్పక్షపాతంగా తేల్చి, తప్పు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజలకు ఒక చట్టం.. అధికారులకు మరో చట్టం అనే భావనకు తావులేకుండా ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

# ప్రతి ఫిర్యాదుపై చట్ట ప్రకారం చర్యలు

- బాధితులకు సత్వర న్యాయం అందించాలి.
- ప్రజల నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలి.
- మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17(జన సంఘర్షణ)

ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వ్యక్తిగత, కుటుంబ, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను సమర్పించారు.ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని, ప్రతి వినతిదారునికి వారి ఫిర్యాదు పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా పోలీస్ శాఖపై ప్రజల విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని అదనపు ఎస్పీ పేర్కొన్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడం, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడం, ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత,జవాబుదారీతనాన్ని పాటించడం మెదక్ జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి భయం, సంకోచం లేకుండా పోలీసులను సంప్రదించాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ హామీ ఇచ్చారు.

# ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులు బుట్టదాఖలేనా?

- ప్రభుత్వ స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, 10 శాతం ల్యాండ్‌పై ఫిర్యాదులు పట్టించుకోవడం లేదని బీజేపీ నేత తృప్తి ప్రసాద్ ఆరోపణ



కామారెడ్డి బ్యూరో । బాన్సువాడ/, ఆగస్టు 17:/జన సంఘర్షణ )

బాన్సువాడ పట్టణంలో ప్రభుత్వ స్థలాలు, రెండు పడక గదుల ఇళ్లు, మున్సిపాలిటీకి సంబంధించిన 10 శాతం ల్యాండ్ విషయంలో కొందరు కబ్జాలకు పాల్పడుతున్నారని, ఈ వ్యవహారాలపై జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు ప్రజావాణి ద్వారా పలుమార్లు ఆధారాలతో సహా లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు కనిపించడం లేదని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు తృప్తి ప్రసాద్ ఆరోపించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాల్సి ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆయన విమర్శించారు. దీంతో ప్రజావాణిలో సమర్పించిన దరఖాస్తులు బుట్టదాఖలవుతున్నాయా? అనే అనుమానం ప్రజల్లో కలుగుతోందని అన్నారు. సోమవారం బాన్సువాడ మండలంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తృప్తి ప్రసాద్ పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన వారికి కాకుండా అధికార పార్టీ నాయకుల అనుచరులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించారని, కొందరికి మూడు చోట్ల స్థలాలు కేటాయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. అలాగే మున్సిపాలిటీకి సంబంధించిన 10 శాతం స్థలాలను కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని..., ఫలానా ప్రాంతంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని స్పష్టమైన వివరాలతో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని తృప్తి ప్రసాద్ పేర్కొన్నారు. "ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తున్నదే ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు. ఫిర్యాదులు లిస్వీకరించి చర్యలు తీసుకోకపోతే ప్రజావాణి నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏమిటి?" అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టి, బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ భూములు, మున్సిపల్ స్థలాలను కాపాడాలని తృప్తి ప్రసాద్ డిమాండ్ చేశారు. అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి జన్మదిన వేడుకలు



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17(జన సంఘర్షణ)

మెదక్ మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి జన్మదిన వేడుకలను మెదక్ పట్టణంలోని 5వ వార్డులో కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువకులు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై శేరి సుభాష్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు మాట్లాడుతూ..శేరి సుభాష్ రెడ్డి ప్రజలతో మమేకమై, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన నాయకులు. ఆయనకు మంచి ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని కోరుకుంటున్నాం. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు గోపాల్ గోపాలరావు జనార్దన్ రెడ్డి సోములు ప్రతాపరెడ్డి నరసింహారెడ్డి వెంకట్ గౌడ్ శ్రీనివాస్ రెడ్డి జయరాములు, కాలనీ ప్రజలు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సేవే స్వాతంత్ర్యానికి సార్థకత

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగస్టు 17(జనసంఘర్షణ):




స్వాతంత్ర్య వేడుకల వేళ
సేవా స్ఫూర్తి చాటిన చేతులకు వందనం...
ఆదివాసీ గుడిసెలలో వెలుగులు నింపుతూ,
అనారోగ్యాన్ని దూరం చేసే దోమతెరలు పంచుతూ
మానవత్వానికి మల్లెపూల పరిమళం అద్దారు!
చర్ల మండలం కుర్నపల్లి గ్రామపంచాయతీ
రామచంద్రాపురంలోని ముప్పై ఐదు ఆదివాసీ కుటుంబాలకు
ఆప్యాయతతో దోమతెరలు అందించిన
లైన్స్ క్లబ్ ఆఫ్ చర్ల సేవా హృదయాలకు
హృదయపూర్వక శుభాభినందనలు!
సేవే మీ సంకల్పం...సమాజమే మీ కుటుంబం...
పేదల కన్నీరు తుడవడమే మీ లక్ష్యం...
ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో కొనసాగించి
నిరుపేదల జీవితాల్లో నూతన ఆశలు నింపాలని ఆకాంక్షిస్తూ,
లైన్స్ క్లబ్ ఆఫ్ చర్ల అధ్యక్షులు
ఆవుల శివప్రసాద్‌కి ప్రత్యేక అభినందనలు!
సేవా బాటలో మీతో కలిసి నడిచిన
మురళీధర్ రెడ్డి, శ్రీకర్, రాము, సుకుమార్,
హరికృష్ణ, శామ్యూల్ రాజ్ గార్లకు
మనస్ఫూర్తిగా అభినందనలు!
స్వాతంత్ర్యం అంటే కేవలం జెండా ఎగరేయడం కాదు---
ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం,
అవసరంలో ఉన్నవారికి చేయూతనివ్వడం,
అణగారిన వారి జీవితాల్లో వెలుగు నింపడమే
నిజమైన స్వాతంత్ర్య స్ఫూర్తి!
మీ సేవా స్ఫూర్తి
మరెందరికో మార్గదర్శకమై,
మరెన్నో సేవా దీపాలు వెలిగించి,
చర్ల నేలపై మానవతా పరిమళాలు వెదజల్లాలని
హృదయపూర్వకంగా కోరుకుంటున్నాం.
సేవే శ్వాసగా...మానవతే మార్గంగా...
పేదల సంక్షేమమే పరమావధిగా
లైన్స్ క్లబ్ ఆఫ్ చర్ల
మరెన్నో విజయవంతమైన సేవా కార్యక్రమాలు నిర్వహించాలని
మనసారా ఆకాంక్షిద్దాం!
జై హింద్! భారత్ మాతాకీ జై! సేవకు జోహార్లు!
సేవామూర్తులకు అభినందనలు తెలియజేస్తూ..!



**మీ...**
**బత్తుల వెంకటేశ్వర్లు, చర్ల. ( కవి, రచయిత)**

# మాదారం తీజ్ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ బాదావత్ రవి

కారేపల్లి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్



సింగరేణి మండలం మాదారం గ్రామంలో తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మిషన్ వాక్ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ బాదావత్ రవి, వారి మిత్రుడు, ఆర్మీ సోల్జర్ దశరథ్ పాల్గొని గిరిజన సంప్రదాయ వేడుకల్లో భాగస్వాములయ్యారు. మాదారం మాజీ సర్పంచ్ అజ్మీరా నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తీజ్ వేడుకలు గ్రామ పెద్దలు, యువతీ యువకులు, మహిళల సమక్షంలో ఎంతో ఉత్సాహంగా జరిగాయి. తీజ్ పండుగ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి పండుగల ద్వారా మన ఆచారాలు, సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బాదావత్ రవి మాట్లాడుతూ గిరిజన సమాజం యొక్క సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలను కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని, గ్రామీణ ప్రాంతాల్లో ఐక్యతను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మిషన్ వాక్ సభ్యులు డాక్టర్ హాజ్రా, షేర్ ఖాన్, సాయి, నరేష్ రంగ, భద్రు తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. గ్రామ పెద్దలు, మిషన్ వాక్ సభ్యులు, యువతీ యువకుల సమక్షంలో తీజ్ వేడుకలు సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిశాయి.

# ప్రమాదాల నివారణకు వై జంక్షన్ పూర్తిస్థాయి మూసివేత

- భారతీయ జనతా పార్టీ హర్షం.
- ఎంపీ మాధవనేని రఘునందన్ రావు కృషికి అభినందనలు.
- బీజేపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17(జన సంఘర్షణ)

రామాయంపేట నేషనల్ హైవే-44పై వై జంక్షన్ వద్ద వరుసగా జరుగుతున్న ప్రమాదాల నివారణ కోసం భారతీయ జనతా పార్టీ చేపట్టిన సుదీర్ఘ పోరాటం ఫలించింది. ప్రమాదాల నివారణలో భాగంగా ఈరోజు వై జంక్షన్‌ను పూర్తిస్థాయిలో మూసివేయడంపై భారతీయ జనతా పార్టీ హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతిస్తోంది.గత కొంతకాలంగా వై జంక్షన్ వద్ద జరుగుతున్న ప్రమాదాలపై భారతీయ జనతా పార్టీ రామాయంపేట ఆధ్వర్యంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, జంక్షన్‌ను మూసివేసి శాశ్వత ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సుదీర్ఘంగా పోరాటం చేసింది. ఈ సమస్యను మెదక్ పార్లమెంట్ సభ్యులు గౌరవనీయులు మాధవనేని రఘునందన్ రావు ప్రత్యేకంగా దృష్టిలోకి తీసుకుని, నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి వెంటనే ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించడం అభినందనీయం. ఎంపీ ఆదేశాల అనంతరం అధికారులు వెంటనే స్పందించి వై జంక్షన్‌ను పూర్తిస్థాయిలో మూసివేయడం ప్రజల భద్రతకు ఎంతో కీలకమైన చర్య. ఈ చర్యతో భవిష్యత్తులో ప్రమాదాలను గణనీయంగా నివారించే అవకాశం ఉందని భారతీయ జనతా పార్టీ భావిస్తోంది. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు బీజేపీ చేసిన సుదీర్ఘ పోరాటానికి ఇది ఒక విజయమని, వై జంక్షన్ మూసివేత నిర్ణయాన్ని భారతీయ జనతా పార్టీ స్వాగతిస్తుందని నాయకులు తెలిపారు.అదేవిధంగా, భవిష్యత్తులో కూడా నేషనల్ హైవేపై ప్రజల భద్రతకు అవసరమైన అన్ని శాశ్వత చర్యలను వేగంగా పూర్తి చేయాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులను భారతీయ జనతా పార్టీ కోరుతోంది.ప్రజల ప్రాణాలే ప్రథమం - ప్రమాదాల నివారణే బీజేపీ లక్ష్యం.భారతీయ జనతా పార్టీ రామాయంపేట.

జన సంఘర్షణ
మంగళవారం 18 ఆగస్టు 2026

# ప్రముఖ పర్యాటక కేంద్రంగా మెదక్ ఖిల్లా

- **గనుల, భూగర్భ, ఉపాధి కార్మిక, పారిశ్రామిక శాఖల, ఇంచార్జి మంత్రి వివేక్ వెంకట స్వామి.**
- **మెదక్ ఖిల్లాపై ప్రత్యేక పోస్టల్ కవర్, స్టాంప్ ఆవిష్కరణ.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 (జన సంఘర్షణ)

మెదక్ పట్టణంలోని చారిత్రక మెదక్ ఖిల్లా పై ప్రత్యేక పోస్టల్ కవర్, స్టాంప్‌ను రాష్ట్ర పర్యాటక, బొగ్గు గనుల శాఖ మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఎమ్మెల్సీ అంజిరెడ్డి తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. మెదక్ ఖిల్లాకు ఎంతో చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. పురాతన కాలంలో నిర్మించిన మెదక్ ఖిల్లా పేరుతో ప్రత్యేక పోస్టల్ కవర్, స్టాంప్ విడుదల చేయడం అభినందనీయమని, ఇందుకు పోస్టల్ శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మెదక్ ఖిల్లాను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి కృషి చేస్తాయని మంత్రి పేర్కొన్నారు. స్వదేశీ దర్శన్ ప్రాజెక్ట్ కింద ఖిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేంద్ర పర్యాటక శాఖ నుంచి నిధులు తీసుకువచ్చేందుకు ఎంపీ రఘునందన్ రావు కృషి చేయాలని సూచించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా మెదక్ జిల్లా ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని మంత్రి విమర్శించారు. మెదక్‌ను పర్యాటక రంగంలో మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రానికి ప్రతిపాదనలు



పంపిస్తామనిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మెదక్ చర్చి అభివృద్ధికి రూ.30 కోట్ల నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు.మెదక్ జిల్లాలోని చారిత్రక,ఆధ్యాత్మిక ప్రాంతాలను అభివృద్ధి చేసి పర్యాటక రంగంలో జిల్లాకు మరింత గుర్తింపు తీసుకువస్తామని స్పష్టం చేశారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. మెదక్ ప్రాచుర్యాన్ని గుర్తించి భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో పోస్టల్ స్టాంప్ కవర్ ప్రారంభోత్సవం చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. స్టాంపు ఆవిష్కరణ సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలిపారు. పురాతన కట్టడంగా పేరెందిన ఈ కోట ప్రాచుర్యాన్ని గుర్తించి స్వదేశీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా ప్రాచీన కాలంలో కట్టిన కోటలు పరిరక్షణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం శుభ పరిణామంగా పేర్కొన్నారు. గతంలో కాకతీయ రాజుల కాలంలో మన మెతుకు సీమ అనే వచ్చిందన్నారు. మంజీరా పరివాహక ప్రాంతంలో పండిన వరి గింజలతో కాకతీయ రాజులకు అన్నం పెట్టేదని ఈ జిల్లాకు మెతుకు సీమ అని పిలవబడిందన్నారు. అనేక రాజకీయ కారణాలవల్ల ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు నిర్లక్ష్యాల వల్ల పూర్తిగా మెదక్ జిల్లా అని నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఒక దశలో నిరాహార దీక్షలో కొట్లాడి మెతుకు సీమ జిల్లా కావాలనే దుస్థితి ఈ జిల్లా ప్రజలు నెట్ట వేయబడ్డారని ఆవేదన వ్యక్తం చేస్తూ చివరగా మెదక్ జిల్లా సాధించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, మెదక్ ఆర్డీవో రమదేవి, డి ఎస్ పి ప్రసన్న కుమార్, పోస్టల్ శాఖ అధికారులు, మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేసే ప్రయత్నం చేస్తుంది

- **పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రుల కష్టాలను ప్రత్యక్షంగా చూసిన కేసీఆర్ ఈ పథకాలను అమలుచేసిండు.**
- **నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహన లేక ప్రజలతో చెలగాటమాడుతున్నారు**
- **యాప్‌ల పేరా రైతులకు యూరియా అందించడంలో పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యింది.**
- **చట్టబద్ధత కోసం హైకోర్టులో కళ్యాణలక్ష్మి పథకం పై కేసు వేస్తే.**
- **కాంగ్రెస్ ప్రభుత్వం తడిబట్టవేసుకోని కాలయాపన చేస్తుంది.**
- **కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను రద్దుచేస్తే తెలంగాణ రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుంది**
- **కాంగ్రెస్ ప్రభుత్వం పై నిప్పులుచెరిగిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 (జన సంఘర్షణ)

పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రుల కష్టాలను ప్రత్యక్షంగా చూసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టి ఎంతో మంది కుటుంబాలకు అండగా నిలిచారని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. పేదల సంక్షేమానికి ఉపయోగపడుతున్న ఈ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసే ప్రయత్నాలు చేస్తోందని ఆమె ఆరోపించారు. సోమవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ ఎత్తున మెదక్ నియోజక వర్గ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో రాస్తారకో, ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సరైన అవగాహన లేకుండా ప్రజలతో చెలగాటమాడుతోందని పద్మాదేవేందర్ రెడ్డి





మండిపడ్డారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై స్పష్టత ఇవ్వకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. ఈ పథకాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ హైకోర్టులో కేసు వేస్తే, ప్రభుత్వం తడిబట్ట వేసుకుని కూర్చున్నట్లుగా వ్యవహరిస్తూ సమస్యను పరిష్కరించకుండా జాప్యం చేస్తోందని విమర్శించారు. అదేవిధంగా రైతులకు యూరియా అందించడంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమె ఆరోపించారు.యాప్‌ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం మానుకుని, వారికి అవసరమైన ఎరువులను సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు పేద కుటుంబాలకు ఎంతో భరోసానిస్తున్నాయని, వాటిని రద్దు చేయాలని చూస్తే తెలంగాణ రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని పద్మాదేవేందర్ రెడ్డి హెచ్చరించారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాలను స్పష్టం చేయాలని, సంక్షేమ పథకాలను యథావిధిగా కొనసాగించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ళ శశిధర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ ఇన్ ఛార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆరేళ్ళ మల్లిఖార్జున్ గౌడ్, రామాయంపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ గంగా నరేందర్, మెదక్ పట్టణ బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ గడ్డమీది క్రిష్ణా గౌడ్, న్యాయవాది జీవన్ రావు, మెదక్ పట్టణ బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ లు మామిండ్ల ఆంజనేయులు, మ్యాదరి దీపక్ కుమార్, సాయి, జుబేర్ అహ్మద్, మాయా గంగమణి మల్లేశం, రామాయంపేట బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ చరిత లతో పాటు మెదక్, రామాయంపేట, హవేలి ఘన్పూర్ పాపన్నపేట, నిజాంపేట, శంకరంపేట మండలాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి సోములు విష్ణువర్ధన్ రెడ్డి, రంగారావు లతో పాటు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# దేశంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో తెలంగాణ నెంబర్ వన్

- **మంత్రి వివేక్ వెంకట స్వామి.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 (జన సంఘర్షణ)

మెదక్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో మహిళలకు స్మార్ట్ కార్డులను పంపిణి చేసిన జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి, మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ప్రజా పాలనలో మహిళలకు అనేక కార్యక్రమాలు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని వైఎస్ హయంలో పావుల వడ్డీ రుణాలు ప్రారంభించారనీ గుర్తు చేశారు.రూ 23వేల కోట్ల రూపాయలు





మహిళలకు రుణాలు అందించామని, ఈవి వాహనాలను కూడా మహిళలకు అందిస్తున్నామన్నారు. మహిళలకు బస్సు ఫ్రీ సదుపాయం కల్పించింది రాష్ట్ర ప్రభుత్వం, పేదలకు సన్నబియ్యం ఇస్తుందన్నారు. పేద పిల్లలకు స్కూల్స్ లలో సన్న బియ్యంతో మంచి భోజనం పెడుతున్నాం అని, సంక్షేమ హాస్టల్ల విద్యార్థులకు మంచి భోజనం పెడుతున్నామన్నారు. త్వరలో విద్యార్థులకు ఫ్రీ టిఫిన్ పెడుతున్నామని, ప్రతి సంక్షేమ పథకం పేదలకు ఉపయోగ పడాలన్నదే ప్రజా ప్రభుత్వం సంకల్పం అన్నారు.గత ఏడాది మూడు వేల ఇందిరమ్మ ఇల్లు ఇచ్చాం. ఈ ఏడాది మరో 2500ఇల్లు ఇస్తున్నాం అని తెలిపారు.ఏ ఊరిలో పెంకుటిల్లు కనిపించవద్దన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ 10లక్షల వరకు వైద్యం అందిస్తున్నామని, విద్యా, వైద్యానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుంది పేర్కొన్నారు. రూ 200కోట్ల రూపాయలతో ఇంటిగ్రెటెడ్ స్కూల్స్,పబ్లిక్ స్కూల్స్ తరహాలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ స్థాపిస్తున్నాం అని వివరించారు. పేదలకు ఉచితంగా 200 యూనిట్ల కరెంట్ వస్తున్నామని, స్మార్ట్ కార్డులలో ఫ్యామిలీ డిటైల్స్ ఉన్నాయి. దేశంలో ఎక్కడ అమలు చేయడం లేదన్నారు. గతంలో రేషన్ కార్డులలో అవకతవకలు జరుగుతుండే కానీ ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదనీ స్పష్టం చేశారు. భూగర్భ గనుల శాఖ ద్వారా రూ 1000కోట్ల ఆదాయం తెచ్చామన్నారు. మహిళలకు 2500 ఇస్తామని మాట ఇచ్చామో ఇచ్చి తీరుతాం అని పునరుద్ఘాటించారు. తెలంగాణలో ఆర్థిక పరిస్థితి బాగుచేసేందుకు సీఎం రేవంత్ కృషి చేస్తున్నారన్నారు.మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టిందన్నారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో





మహిళలకుమహాలక్ష్మి,పేదలకు సన్న బియ్యం, జీరో విద్యుత్, సబ్సిడీ సిలిండర్ లాంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, గ్రంథా లయాల చైర్మన్ సుహాసిని రెడ్డి, ట్రేని ఆర్డీవో అహ్మద్ మొహమ్మద్, మెదక్, రామయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీల చైర్పర్సన్లు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు బీమా పథకాన్ని కొనసాగించాలి

- **రైతు కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించిన రైతు బీమా పథకాన్ని ఎలాంటి విరామం లేకుండా కొనసాగించాలి.**
- **తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు అక్క మొల్ల మైసయ్య యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17(జన సంఘర్షణ)



రైతు బీమా పథకం ద్వారా రైతు కుటుంబాలకు అండగా నిలిచే ఐదు లక్షల రూపాయలు భీమా రక్షణను కొనసాగించడం అత్యవసర అవసరములకు రైతు కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబానికి ఒక సాయంగా ఆర్థిక ఇబ్బందుల్లో పడుతున్న అలాంటి సమస్యల్లో రైతు బీమా ఆకుటుంబానికి ఎంతో కీలకమైన భరోసా కల్పిస్తుందని మైసయ్య యాదవ్ తెలిపారు. 2025-26 సంవత్సరానికి సంబంధించిన రైతు బీమా కాలపరిమితి మురిసినందున నేపథ్యంలో 2026 27 సంవత్సరానికి బీమా పథకం కొనసాగించడంపై ప్రభుత్వం వెంటనే స్పష్ఠత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మిర్యాల చంద్రశేఖర్ జిల్లా కార్యదర్శి బోయిని రమేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ రెడ్డి, జిల్లా ముఖ్య సలహాదారులు కొండా ఎల్లం యాదవ్, జిల్లా సబ్బులు పి.మల్లేష్ పరశురాం ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ఆస్పత్రిలో చికిత్స పొందిన లాలు అనే వ్యక్తికి ఆసుపత్రిలో మాట ఇవ్వడం వల్ల ఆర్థిక సాయం అందజేత

- **కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 (జన సంఘర్షణ)



దుబ్బాక నియోజకవర్గం చేగుంట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన లాలు ఆరోగ్య సమస్య కారణంతో హాస్పిటల్లో అడ్మిట్ అయి ఆపరేషన్ చేయించుకున్నారు. వారిని పరామర్శించడానికి వెళ్లిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ డిశ్చార్జ్ అయినప్పుడు ఆర్థిక సహాయం ఇస్తానని మాట ఇచ్చారు ఇచ్చిన మాట ప్రకారం డిశ్చార్జ్ అయిన రోజు 25,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో బాల్య,రాజు, బాల్ సింగ్, సామ్య నాయక్, తారాసింగ్, బాలకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ దేశంలో ఉండాలంటే వందేమాతరం పాడాల్సిందే

- **సోనియా గాంధీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలి.**
- **బీజేవైఎం నాయకులు డిమాండ్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 (జన సంఘర్షణ)



భారతీయ జనతా పార్టీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండె పిలుపుమేరకు బీజేవైఎం మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ అధ్వర్యంలో మెదక్ కాంగ్రెస్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు నిరసన నిర్వహించి పూర్తి వందేమాతరంని ఆలకించడం జరిగింది. ఈ సందర్భంగా మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్ మాట్లాడుతూ.. 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వందేమాతర గీతాన్ని ఆలకించాల్సింది పోయి ఈ కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ రాహుల్ గాంధీ మల్లిఖార్జున ఖర్గే వందేమాతరాన్ని అవహేళన చేస్తూ ఆలకించకపోవడం సిగ్గుచేటు వాళ్ళు వెంటనే యావత్ భారత ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. లేకపోతే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవలని డిమాండ్ చేశారు. వారికి భారత్‌లో ఉండడానికి అధికారం లేదు. భారత దేశంలో ఉండాలంటే వందే మాతరం పడాల్సిందే వందేమాతరం ఒక నినాదమే కాదు భారతీయుల ఆత్మగౌరవం వందేమాతరం తోనే స్వరాజ్యాన్ని సిద్ధించుకుంది. స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం నినాదాన్ని ఎంతో మంది ఆదర్శంగా తీస్కొని ప్రజలు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. అలాంటి వందేమాతరాన్ని ఈ కాంగ్రెస్ నాయకులు పాడడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. అలాంటి ఈ వందేమాతరాన్ని పాడని వాళ్లు పాకిస్తాన్ మరియు ఇటలీకి వెళ్లిపోవచ్చు అని చెప్పడం జరిగింది. అనంతరం సామూహికంగా పూర్తి వందేమాతరాన్ని ఆలపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్ జిల్లా జనరల్ సెక్రటరీ రంజిత్ రెడ్డి బీజేవైఎం నాయకులు మెదక్ టౌన్ ప్రెసిడెంట్ బబ్లూ, అసెంబ్లీకన్వీనర్, సాయి, మనోజ్, సాయి బాబా గౌడ్, నర్సింగ్, రవి, పృథ్వి, సన్నీ, జగదీష్, విక్రమ్, విష్ణు వర్ధన్, మధు, సాయి, మహేందర్, అభి, నాగరాజు, సురేందర్ గౌడ్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## నాగుల పంచమి సందర్భంగా ఘనంగా ఆవు పాలు పంపిణీ

- శ్రీ వివేకానంద యూత్ ఆధ్వర్యంలో భక్తులకు పాలు పంపిణీ..
- సేవాభావాన్ని చాటుకున్న యువత....



ఆగస్టు 17 (జన సంఘర్షణ): నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఆవు పాలు పంపిణీ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగుల పంచమి సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు పాలను ప్రసాదంగా అందజేశారు. ఈ సందర్భంగా యువత భక్తులకు ఎలాంటి అసౌకర్యం.... కలగకుండా ఏర్పాట్లు చేస్తూ, అందరికీ ఆవు పాలను అందించారు. పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు సేవా కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. భక్తితో పాటు సేవాభావాన్ని చాటుకున్న శ్రీ వివేకానంద యూత్ సభ్యులు, వడ్ల దత్తు, సీతాలే మోహన్, రమేష్ గౌడ్, సూద్దాం భూమయ్య, మేదరి దశరథ్, వంకారి, మోహన్, గాండ్ల సాయిబాబా, కూర్మ సాయిలు, స్థానికులు అభినందించారు. పలువురు అభినందించారు. పండుగ రోజున సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

- కెనరా బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ కుర్సం ఎర్రయ్య.
- వనవాసీ నిలయం కు క్వింటా బియ్యం వితరణ గా అందచేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్ల మండలం, ఆగస్ట్ 17 (జనసంఘర్షణ):



చర్లలో కొమరం భీమ్ విద్య నిలయం, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడు తూ..క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని కెనరా బ్యాంక్ విశ్రాంత మేనేజర్ కుర్రం ఎర్రయ్య అన్నారు. చర్లలోని ఆయిల్ బంక్ ఏరియాకు చెందిన విశ్రాత విలేజ్ డవలప్ మెంట్ అదికారి, కీర్తిశేషులు సోయం భద్రయ్య జ్ఞాపకార్థం ఆయన మనుమడు, ఖమ్మం పంజాబ్ సింద్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ కుర్సం రవితేజ కొమరం భీం విద్యార్థి నిలయంకు క్వింటా బియ్యం, విద్యార్దులకు ఒకపూట బోజనం వితరణగా అందచేసారు. ఈ సందర్భంగా జరిగిన నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అద్యక్షతన జరిగిన కార్యక్రమంలో, రవితేజ తండ్రి, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ కుర్సం ఎర్రయ్య మాట్లాడారు. ఆదివాసీ బిడ్డల అభ్యున్నతికి వసతిగృహం నిర్వహించడం అబినందనీయమని పేర్కొన్నారు. మారుమూల అటవీప్రాంత గ్రామాలకు చెందిన ఆదివాసీ విద్యార్థులను నిలయంలో వసతి కల్పించి వారిని అన్ని రంగాలలో ఉత్తములుగా తీర్చిదిద్దడం సంతోషకరమని పేర్కొన్నారు. విద్యార్థుల క్రమశిక్షణ, సంస్కృత స్లోకాలు పాడుతున్న తీరు అబ్బురపరుస్తోందని వెల్లడించారు. విద్యార్థుల అభ్యున్నతికి నిలయ కమిటీ చేస్తున్న కృషి మరువలేనిదని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు ఇక్కడి పిల్లలను తమ సొంత వారిగా చూడటం సంతోషకరమని అన్నారు. విద్యార్థులు సైతం తమకు అందివచ్చిన అవకాశం సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పట్టుదలతో చదివి తల్లిదండ్రులతో పాటు నిలయానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. మనిషి తలచుకుంటే సాదించ లేనిది అంటూ ఏమి ఉండదని, పట్టుదలతో చదివి ఉన్నత స్దితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భద్రాచలం ఐటిడిఏ రిటైర్డ్ అసిస్టెంట్ మానిటరింగ్ అదికారి, భద్రయ్య కుటుంబ సభ్యులు తెల్లం రమణయ్య, చింత మంగారావు, సోడి సుబ్బారావు, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం మణికుమార్, కొమరం భీం, శబరి నిలయ ప్రముఖ్ లు సంతోష్, వరలక్ష్మి, తోలెం రామకృష్ణ, కూడం ఉంగయ్య పాల్గొన్నారు.

## ఎంపీడీఓ, తహసీల్దార్‌కి ఘనంగా సన్మానం చేసిన తుడుందెబ్బ బృందం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 17(జనసంఘర్షణ):





చర్ల మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉత్తమ ఎంపీడీఓ గా అవార్డు అందుకున్న చర్ల ఎంపీడీఓ కి ఘన సన్మానం చేసిన తుడుందెబ్బ బృందం, అలాగే ఉత్తమ ఏఇఆర్ఓ గా అవార్డు అందుకున్న చర్ల తహసీల్దార్‌కి సన్మానం చేసిన తుడుందెబ్బ బృందం. అలాగే ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు వాసం ముసలయ్య మాట్లాడుతూ,చర్ల విధులు నిర్వహిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే ఉత్తమ ఎంపీడీఓ అవార్డు అందుకున్నందుకు చాల గర్వంగా ఉందని అలాగే ఏజెన్సీలో ఇలాంటి అధికారులు ఉండటం చాల గర్వంగా ఉందని అన్నారు. అలాగే చర్ల తహసీల్దార్‌కి ఉత్తమ ఏఇఆర్ఓ గా అవార్డు రావడం చాల ఆనందంగా ఉందని అన్నారు. అలాగే చర్ల ఎంపీవోకి కంగ్రాట్యులేషన్స్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్, తుడుందెబ్బ సీనియర్ నాయకులు తాటి వెంకటరావు, తుడుందెబ్బ మండల యువ నాయకులు పూనెం రవికిరణ్, పురిటి ప్రశాంత్, ఇర్ప అరుణ్ తేజ్, తదితరులు పాల్గొన్నారు.

## పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి, వారిని స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- తెలంగాణ రాష్ట్ర కార్మిక ఉపాధి భూగర్భ గనుల శాఖ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు.





ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం, రూ.3.25 కోట్లతో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) భవనాన్ని, చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో 3.25 లక్షలతో నిర్మించిన కేజీబీవీ భవనాన్ని, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి, సంబంధిత ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులతో కలిసి మంత్రి గడ్డం వివేక వెంకటస్వామి సోమవారం ప్రారంభించారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినిలతో సమావేశమై సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. బాలిక విద్యను బలోపేతం చేయడంలో భాగంగా ప్రభుత్వం అనేక రకాల మౌలిక వసతులను కల్పిస్తూ కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తుందన్నారు. ఏమైనా సౌకర్యాలు ఉంటే మెరుగుపరిచేందుకు కృషి చేస్తానన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి, వారు తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పేదల పక్షపాతిగా పనిచేస్తోందని తెలిపారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. కస్తూరిబా గాంధీ విద్యాలయాల ఉపాధ్యాయుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని వారి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కస్తూరిబా గాంధీ విద్యాలయంలో ఏమైనా వసతులు పై తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ ఈరోజు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అన్ని రకాల మౌలిక వసతులతో విద్యార్థినీ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందని, క్రమశిక్షణగా మంచిగా చదువుకుని ఇటు జిల్లాతో పాటు గ్రామానికి కూడా మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. కేజీబీవీలో అదనపు తరగతి గదుల నిర్మాణ కార్యక్రమం పూర్తికావడం సంతోషంగా ఉందన్నారు. కేజీబీవీల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయా లేదా అన్న అంశంపై ఏపీసీలు, కోఆర్డినేటర్లు, డీఈఓ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు మంచిగా చదువుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ప్రభుత్వాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి వేడుకలు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 (జన సంఘర్షణ)



శ్రావణమాసంలో వచ్చే నాగుల పంచమి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆడపడుచులు ఉదయం నుంచే ఆలయాలకు చేరుకుని పుట్టలో పాలు పోసి నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మెదక్ మండలంలోని మంభోజిపల్లి శివారులో ఉన్న కోయగుట్ట మల్లన్న స్వామి ఆలయ ప్రాంగణంలో నాగుల పంచమి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నాగదేవతకు పూజలు చేసి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు కోరుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తుల రాకతో సందడిగా మారాయి. ఉదయం నుండి భక్తులు శ్రీ మల్లన్న స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ వ్యవస్థాపక పూజారి మల్లన్న స్వామి గారికి అర్చన హారతి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## చల్మెడ మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న పద్మాదేవేందర్ రెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా నిజాంపేట మండలం చల్మెడ గ్రామ మాజీ సర్పంచ్ చెప్పెట నరసింహారెడ్డి గత శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి సోమవారం చల్మెడ గ్రామానికి చేరుకుని నరసింహారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి కుమార్తెలు వెన్నెల, మానసలను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. గుండెపోటుతో నరసింహారెడ్డి మృతి చెందడం బాధాకరమని తెలిపారు. సర్పంచిగా ఉన్న సమయంలో గ్రామానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నరసింహారెడ్డి భార్య పద్మ క్రితమే మృతి చెందారని గుర్తు చేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ఆకుల రామవ్వ మృతి విషయం తెలుసుకున్న పద్మాదేవేందర్ రెడ్డి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.వీరి వెంట బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# నిరుద్యోగ యువత భవితకు భరోసా

- మ్యాజిక్ పోర్టల్ మంత్రి వివేక్ వెంకటస్వామి
- తెలంగాణలోని తొలి జిల్లాలలో పోర్టల్ రూపొందించడంలో మెదక్ ప్రథమ స్థానం
- జిల్లా కలెక్టర్ చొరవతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలపై ప్రత్యేక శ్రద్ధ
- మెదక్ ఎంప్లాయ్‌మెంట్, స్కిల్స్, ఇండస్ట్రీ కనెక్ట్ మ్యాజిక్ పోర్టల్ ప్రారంభోత్సవంలో మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడి.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17(జన సంఘర్షణ)

మెదక్ జిల్లా ఇంచార్జి శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి పర్యటనలో భాగంగా శాంతాబయోటిక్స్ పరిశ్రమలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రత్యేక చొరవతో సీనియర్ అధికారులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థుల సమక్షంలో మెదక్ ఎంప్లాయ్‌మెంట్, స్కిల్స్ & ఇండస్ట్రీ కనెక్ట్ (మీజిక్×జ) పోర్టల్‌ను జిల్లా ఇన్చార్జి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత భవితకు భరోసా కల్పించాలని ఉద్దేశంతో అనేక ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి కుటుంబాలకు ఆర్థికచేయూతనందిస్తుందన్నారు. మెదక్ జిల్లాలో ఈ పోర్టల్ అనేది విద్యార్థులు, ఉద్యోగార్థులు, నైపుణ్య సంస్థలు, స్థానిక పరిశ్రమలను ఒకే,



ధృవీకరించబడిన వ్యవస్థపై అనుసంధానించడానికి జిల్లా స్థాయిలో అభివృద్ధి చేయబడిన ఒక డిజిటల్ వేదిక అని తెలిపారు. మెదక్ జిల్లా కలెక్టరేట్‌కు చెందిన జిల్లా ఐటీ బృందం మరియు ఐటీసీ లిమిటెడ్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయబడిన మ్యాజిక్ జిల్లా స్థాయిలో ఒక ప్రత్యేకమైన, సమీకృత ఉపాధి-నైపుణ్య వేదికను ప్రారంభించిన తెలంగాణలోని తొలి జిల్లాలలో మెదక్‌ను ఒకటిగా నిలబెట్టింది. అని అభివర్ణించారు.మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థుల కోసం మ్యాజిక్ అనేది ఒక రెండు-ట్రాక్ రిజిస్ట్రేషన్ ప్లాట్‌ఫామ్. ఇది ధృవీకరించబడిన విద్యార్థి ప్రొఫైల్‌లను యజమానుల అవకాశాలతో సరిపోల్చడానికి వీలు కల్పిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రసారం కాకముందే వారి సంస్థచే ధృవీకరించబడేలా నిర్ధారిస్తుంది -అని తెలిపారు. ఇందులో ప్రతి కళాశాల నుండి ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు ప్లేస్‌మెంట్ మేనేజర్లుగా వ్యవహరిస్తారన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలో 100 ఇండస్ట్రీలు కలవని వారి నైపుణ్యాలకు అనుగుణంగా ఏ పరిశ్రమలో జాబు పొందాలో వారికి తెలియని పరిస్థితి ఉందని, చాలామంది హైదరాబాదు వంటి నగరాలకు ఉద్యోగాల గురించి వెళ్తున్నారని అలా కాకుండా మన జిల్లాలోని నిరుద్యోగ యువత వారి నైపుణ్యాలకు అనుగుణంగా ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకుని సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు అన్నారు. ఈ పోర్టల్ ద్వారా అన్ని ఇండస్ట్రీకు లాగిన్ పాస్వర్డ్ ఇస్తున్నామని నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో బావయ్య, ఎ లా చైర్పర్సన్ సుబ్బారావు, ఐ టి సి ఆనంద్, ఈడియం సందీప్, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ


మంగళవారం
18 ఆగస్టు 2026

# కళ్యాణ లక్ష్మీ,షాది ముబారక్ పథకాన్ని కొనసాగించాల్సిందే

- **తులం బంగారం ఇవ్వాల్సిందే**
- **మాజీ ఎమ్మెల్యే మెచ్చా**

**17-8--2026జన సంఘర్షణ**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కళ్యాణ లక్ష్మీ ,షాది ముబారక్ పథకాన్ని నిలిపివేయడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలమేరకు నేడు అశ్వారావుపేట ఎమ్మార్వో కార్యాలయం ఎదుటఅశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. డిమాండ్లతో కూడిన మెమొరాండంని తహశీల్దార్ కి అందజేశారు. ఈ సందర్భంగా మెచ్చా మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన వెంటనే పేద కుటుంబాల్లో ఆడబిడ్డ వివాహం ఎంతటి ఆర్థిక భారమో గుర్తించిన .కెసిఆర్ 2014 అక్టోబర్ 02న కళ్యాణ లక్ష్మీ - షాది ముబారక్ పథకాన్ని ప్రారంభించారని.ప్రారంభంలో 51వేలుగా ఉన్న ఆర్థిక సహాయం తర్వాత 1,00,116కు పెంచారని.ప్రభుత్వమే ఒక కుటుంబ సభ్యుడిగా భాగస్వామిగా నిలబడిందని. సుమారు 13లక్షల మంది ఆడబిడ్డలకు కెసిఆర్ మేనమామలా సహాయాన్ని అందించారని. ఆడబిడ్డలకు గొప్ప వరంగా ఈ పథకం నిలిచిందని.ఈ పథకానికి జాతీయ స్థాయిలో ప్రశంసలు సైతం లభించిందని.2023 ఎన్నికల సమయంలో కెసిఆర్ కేవలం లక్ష మాత్రమే ఇస్తున్నారు నేను గెలిచిన రోజు నుంచి లక్షతో పాటి తులం బంగారం కూడా ఇస్తానని ఆడబిడ్డలను నమ్మబలికి నేడు అధికారంలోకి వచ్చాక హామీని అమలు చేయకపోగా..ఇప్పటికే అమలులో ఉన్న పథకాన్ని ప్రశ్నార్థకంగా మార్చేసిందని. ఆడబిడ్డలు సైతం తులం బంగారం గురించి స్థానిక కాంగ్రెస్ శాసనసభ్యులను ప్రశ్నిస్తున్న విషయం తెలుసే కావాలని ఈ పథకాన్ని ఎత్తివేయటానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కెసిఆర్ ప్రభుత్వంలో 30రోజుల్లో ఆర్థిక సహాయం అందితే నీటి ఈ రేవంత్ ప్రభుత్వంలో పెళ్ళై పిల్లలు పుట్టినా ఆర్థిక సహాయం అందడం లేదని.కార్యాలయాల చుట్టూ తిరగలేక ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారనే విషయాన్ని గుర్తుచేశారు. హైకోర్టులో గడువు లభించినప్పటికీ కౌంటర్ ఎందుకు వెయ్యలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి,మంత్రులు లేదా ప్రభుత్వ కీలక కేసుల్లో ప్రైవేట్ న్యాయవాదుల సేవలు తీసుకునే ప్రభుత్వం పేద ఆడబిడ్డల హక్కులకు సంబంధించిన పథకం విషయంలో ఎందుకు సరిగ్గా స్పందించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కావాలనే ఆలస్యం చేసి పథకాన్ని నిలిపివేయాలనే ఆలోచనను మానుకోవాలని.పెండింగ్‌లో ఉన్న అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఆలస్యం లేకుండా ఆర్థిక సహాయం విడుదల చెయ్యడంతో పాటు.హైకోర్టు కేసులో ప్రభుత్వం తీసుకున్న చర్యలపై స్పష్టత ఇవ్వాలని.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన




తులం బంగారం హామీని ఎప్పుడు,ఎలా అమలు చేస్తుందో స్పష్టమైన ప్రకటన చెయ్యాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జూపల్లి రమణారావు, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, యుఎస్ ప్రకాశ్ రావు, సంక ప్రసాద్, సర్పంచ్ నాగమణి, మాజీ సర్పంచ్ నారం రాజ్ శేఖర్, దుర్గయ్య, కలపాల బాబురావు, ఆరేపల్లి రాంబాబు, వెలేటి పార్వతి, శెట్టిపల్లి రఘురాం, శ్రీదేవి, కృష్ణ,చందా లక్ష్మీ నర్సయ్య, నరసింహం, కుమార స్వామి, చిన్నంశెట్టి రాంబాబు, అలా రాంబాబు, సాయిల వెంకటేశ్వరరావు, ఆసిఫ్, రెహ్మాన్, చిప్పనపల్లి శ్రీను, దుర్గయ్య, కుప్పల కృష్ణ, బుజ్జిబాబు, వెంకటేశ్వరరావు, రవి, వెంకటేష్, తల్లాడ వెంకటేశ్వరరావు, రాంబాబు, కూరపాటి నరేష్, రమేష్, ధర్మ, వెంకన్న, డాక్టర్ వెంకటేశ్వరరావు, ముక్కయ్య, బన్ను, ప్రదీప్ తదితరులు ఉన్నారు.

# ఆంధ్ర పాలకుల డైరెక్షన్‌లో రేవంత్ పాలన

- **కల్యాణ లక్ష్మి--షాదీ ముబారక్, రైతు బీమా పథకాలను కొనసాగించాలి: బీఆర్ఎస్ నాయకులు**

**కోటగిరి, ఆగస్టు 17 (జన సంఘర్షణ):**

తెలంగాణ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆంధ్ర పాలకుల డైరెక్షన్‌లో పాలన సాగిస్తున్నారని కోటగిరి మండల బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు సోమవారం కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట కల్యాణ లక్ష్మి--షాదీ ముబారక్, రైతు బీమా తదితర సంక్షేమ పథకాల పరిరక్షణ కోసం ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకుడు తెల్ల రవికుమార్ మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసి, ఆయన ఆనవాళ్లను చెరిపివేసే కుట్రలో భాగంగానే ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచిన కల్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే రాష్ట్రంలో అంధకారం మాత్రమే మిగులుతుందని గతంలో ఆంధ్ర పాలకులు విమర్శలు చేశారని, అయితే కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకెళ్లిందని పేర్కొన్నారు. ప్రస్తుతం జరిగిన అభివృద్ధిని వెనక్కి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ... పథకాలను కొనసాగించడంతో పాటు అర్హులైన ప్రతి కుటుంబానికి వాటి ప్రయోజనాలు అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. కల్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ పథకాలను కొనసాగించకపోతే మహిళలతో కలిసి మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు కూడా వెనుకాడబోమని తెలిపారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ గంగాధర్కు అందజేశారు... నిరసన కార్యక్రమానికి సంబంధించిన నివేదికను తక్షణమే ప్రభుత్వానికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోరే కిషన్, ఫారుక్, శివకాంత్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు దేవేందర్, కప్ప సంతోష్, నజీర్, కుమ్మరి లక్ష్మి, శంకర్ గౌడ్, ఆంజనేయులు, కర్ణ గజేందర్, మసూద్, కుమ్మరి హనుమాన్లు, చిన్న అరవింద్, గంగా ప్రసాద్ గౌడ్, వడ్ల ఉమాకాంత్, జలాల్, కమ్మరి గగన్, రుద్రంగి సందీప్, మంజునాథ్, కమ్మరి విజయ్, వడ్ల శ్రీనివాస్, కన్నం సాయిలు, పాషా బాయ్, బేగరి మారుతి, మామిడి నవీన్, పాలగంగారం, మేత్రి






గంగాధర్, కప్ప జైసూర్య, గూడు సాబ్, శివ, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## పోతంగల్ మండల ప్రజావాణికి 4 దరఖాస్తులు

- **తొలిసారిగా ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి ప్రజావాణి..**
- **వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై వినతులు**

**పోతంగల్,/ ఆగస్టు 17/ (జన సంఘర్షణ):**




పోతంగల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం తొలిసారిగా మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కారం కోసం దరఖాస్తులు సమర్పించారు. ప్రజావాణిలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఒక దరఖాస్తు, టీజీఎన్‌పీడీసీఎల్ పోతంగల్‌కు సంబంధించి రెండు దరఖాస్తులు, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి ఒక దరఖాస్తు అందాయి. మొత్తంగా ప్రజల నుంచి నాలుగు దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు పంపించి, నిబంధనల ప్రకారం పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలకు వేదికగా ప్రజావాణి కార్యక్రమం నిలుస్తుండటంతో, రానున్న రోజుల్లో మరిన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

## బీర్కూర్‌లో ప్రజావాణికి అపూర్వ స్పందన

- **తొలి రోజే 20 దరఖాస్తులు.. వచ్చే సోమవారం మరిన్ని ఫిర్యాదులు వచ్చే అవకాశం**

**బీర్కూర్, /ఆగస్టు 17/ జన సంఘర్షణ**



ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమానికి బీర్కూర్ మండలంలో తొలి రోజే అపూర్వ స్పందన లభించింది. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై మొత్తం 20 దరఖాస్తులు అందినట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీనిధి తెలిపారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బీర్కూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనిధి అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్.. సవాయిసింగ్, ఎంపీఓ మహబూబ్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు పలువురు ప్రజలు ప్రజావాణికి తరలివచ్చారు. పంచమి పండుగ కావడంతో ఆశించిన స్థాయిలో ప్రజలు హాజరు కాలేకపోయారని అధికారులు తెలిపారు. దీంతో వచ్చే సోమవారం నిర్వహించే ప్రజావాణికి మరింత మంది ప్రజలు హాజరై పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందించే అవకాశం ఉందని పేర్కొన్నారు. మండల పరిధిలో పరిష్కరించగల సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరిస్తామని ఎంపీడీవో శ్రీనిధి తెలిపారు. జిల్లా స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకునేలా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కల్యాణ లక్ష్మీ--షాదీ ముబారక్ పథకాన్ని నిరంతరాయంగా కొనసాగించాలి

- **పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి: బీఆర్ఎస్ నాయకులు**

**పోతంగల్, ఆగస్టు 17 (జన సంఘర్షణ):**




పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కల్యాణ లక్ష్మీ--షాదీ ముబారక్ పథకాన్ని ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా కొనసాగించాలని కోరుతూ బీఆర్ఎస్ పోతంగల్ మండల నాయకులు తహసీల్దార్ సందీప్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన కల్యాణ లక్ష్మీ--షాదీ ముబారక్ పథకం పేద కుటుంబాలకు ఎంతో అండగా నిలిచిందన్నారు. ఆడపిల్లల వివాహ సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలకు ఈ పథకం గొప్ప ఆసరాగా మారిందని పేర్కొన్నారు. ప్రస్తుతం పథకం నిలిచిపోవడంతో పేద కుటుంబాలు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మహిళల సంక్షేమానికి సంబంధించి పలు హామీలు ఇచ్చిందని, అర్హులైన వధువులకు వివాహ సమయంలో రూ.1 లక్ష నగదుతో పాటు 10 గ్రాముల బంగారం అందిస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. ఎన్నికల హామీలకు అనుగుణంగా కల్యాణ లక్ష్మీ--షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను వెంటనే పరిశీలించి, వారికి ఆర్థిక సహాయం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పేద కుటుంబాల ఆర్థిక భరోసాను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ సంక్షేమ పథకాన్ని నిరంతరాయంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ వినతిపత్రాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరినట్లు బీఆర్ఎస్ పార్టీ పోతంగల్ మండల నాయకులు సూద్దాం నవీన్, జిల్లపల్లి ఫారం, ఆరిఫ్, జల్లపల్లి ఓల్డ్ విలేజ్ రాములు, సూద్దాం సాయిలు, సాగర్, గన్ షామ్, కల్లూరి సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఎటు ఓటు వేశారు?

- **హైకోర్టు కీలక ప్రశ్నలు**
- **ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంపై విచారణ.. అధికార పక్షానికి రాజకీయంగా మరింత ఒత్తిడి**

**హైదరాబాద్,/ ఆగస్టు 17 /జన సంఘర్షణ/**



తెలంగాణలో పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు అంశానికి సంబంధించి బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ధర్మాసనం చేసిన కీలక ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అసెంబ్లీలో బిల్లులు ప్రవేశపెట్టిన సమయంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఎటువైపు ఓటు వేశారని, విప్ జారీ చేసినప్పుడు వారి వైఖరి ఏమిటని ధర్మాసనం పిటిషనర్‌ను ప్రశ్నించింది. మూజువాణి ఓటు సమయంలోనూ ఆయా ఎమ్మెల్యేలు ఏ పక్షం వైపు మొగ్గు చూపారో వివరించాలని ప్రశ్నించింది. బీఆర్ఎస్ తరఫున వాదనలు వినిపిస్తూ, ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన కొందరు అనంతరం కాంగ్రెస్‌లో చేరారని, అయినప్పటికీ తాము బీఆర్ఎస్ ఎమ్మెల్యేలమేనని చెప్పుకుంటున్నారని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే పార్టీ కార్యక్రమాల్లో మాత్రం వారు పాల్గొనడం లేదని వివరించారు. దానం నాగేందర్ అంశాన్ని కూడా పిటిషనర్ ప్రస్తావిస్తూ, ఆయనపై అనర్హతకు సంబంధించిన ఆధారాలను సమర్పించినప్పటికీ స్పీకర్ ట్రిబ్యునల్ నుంచి తగిన చర్యలు తీసుకోలేదని వాదించారు. ఇదే సమయంలో పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ ఎలాంటి చర్యలు తీసుకుందని కూడా ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో ఫిరాయింపుల వ్యవహారంలో కేవలం రాజకీయ ఆరోపణలకే పరిమితం కాకుండా, అసెంబ్లీలో వారి వాస్తవ వైఖరి, ఓటింగ్ తీరు, విప్‌కు స్పందన వంటి అంశాలు కూడా కీలకమవుతాయన్న సంకేతాలు కోర్టు విచారణలో కనిపించాయి.

**అధికార పార్టీకి హెచ్చరికగా మారిన కోర్టు ప్రశ్నలు......**

హైకోర్టు విచారణలో వెలువడిన ప్రశ్నలు అధికార కాంగ్రెస్‌కు రాజకీయంగా ఇబ్బందికర.. పరిస్థితిని సృష్టించే అవకాశముందని బీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రజా తీర్పుతో ఒక పార్టీ గుర్తుపై గెలిచి, అనంతరం మరో పార్టీలో చేరిన ఎమ్మెల్యేల వ్యవహారంలో ఇకపై "ప్రజా తీర్పు ఎటు? ఎమ్మెల్యేల విధేయత ఎటు?" అనే ప్రశ్న మరింత తీవ్రంగా మారనుంది. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో చట్టపరమైన ప్రక్రియను తేలికగా తీసుకుంటే పరిణామాలు... తీవ్రంగా ఉంటాయని, ప్రజా తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపైనా ఉందని ప్రతిపక్ష వర్గాలు ఘాటుగా హెచ్చరిస్తున్నాయి. కోర్టు విచారణలో లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత అధికార పక్షంపై ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం · తెలుగు దినపత్రిక
మంగళవారం
18 ఆగస్టు 2026

# బీర్కూర్ విద్యార్థిని శివ సేతనకు జాతీయ స్థాయిలో ప్రతిభ

- 96 శాతం పర్సంటైల్‌తో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సీటు..
- భవిష్యత్ లక్ష్యం ఐఏఎస్

బీర్కూర్,/ ఆగస్టు 17 /జన సంఘర్షణ

కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదలతో బీర్కూర్‌కు చెందిన మల్లెల శివ సేతన జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. దేశవ్యాప్తంగా సుమారు 11 లక్షల మంది విద్యార్థులు హాజరైన సీయూఈటీ (జఖజు) ప్రవేశ పరీక్షలో 96 శాతం పర్సంటైల్ సాధించి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కోర్సులో హిస్టరీ విభాగంలో సీటు సాధించారు. సివిల్స్ పరీక్షకు సిద్ధమై భవిష్యత్తులో ఐఏఎస్ అధికారిగా ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో శివ సేతన ముందుకు సాగుతున్నారు. ఇందుకోసం సీయూఈటీ ప్రవేశ పరీక్షకు మూడు నెలల పాటు ప్రత్యేక ప్రణాళికతో సన్నద్ధమై, తక్కువ సమయంలోనే క్రమశిక్షణతో చదివి జాతీయ స్థాయి పరీక్షలో మంచి పర్సంటైల్ సాధించారు. శివ సేతన తల్లిదండ్రులు క్యా కప్ప, మల్లెల అనిత ఇద్దరూ పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకున్న శివ సేతన.. ఉన్నత విద్యను అభ్యసించి సివిల్స్‌లో విజయం సాధించడం ద్వారా ఐఏఎస్ అధికారిగా ప్రజలకు సేవ చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో ప్రతిభ.. కనబరిచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సీటు సాధించిన శివ సేతనను కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు, స్థానికులు అభినందించారు. పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగుతున్న ఆమె భవిష్యత్తులో అనుకున్న లక్ష్యాన్ని సాధించి బీర్కూర్‌కు మరింత పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు.



## కోటగిరి ఎండీఓ కార్యాలయంలో తొలిసారి ప్రజావాణి

- 11 దరఖాస్తులు స్వీకరణ.. వివిధ శాఖల అధికారులు పాల్గొనడం


కోటగిరి, ఆగస్టు 17 (జన సంఘర్షణ):




నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం తొలిసారిగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎండీఓ విష్ణు, తహసీల్దార్ గంగాధర్, ఎంఈఓ శ్రీనివాసరావు, ఏఓ రాజు ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన మొత్తం 11 దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 4 దరఖాస్తులు, పెన్షన్లకు 4, విద్యాశాఖకు 1, రెవెన్యూ శాఖకు 1, మోటార్ వెహికల్‌కు సంబంధించి 1 దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజల సమస్యలను అధికారులు స్వీకరించి, సంబంధిత శాఖల... ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కొమరవ్వతో పాటు విద్యుత్, వైద్య శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటు హర్షణీయం

- గౌడ సమాజానికి ఇది దక్కిన సముచిత గౌరవం : బాన్సువాడ నియోజకవర్గ గౌడ సోదరులు



కామారెడ్డి, బాన్సువాడ, ఆగస్టు 17 (జన సంఘర్షణ):

హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై బహుజన వీరుడు, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం పట్ల బాన్సువాడ నియోజకవర్గ గౌడ సోదరులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 366వ జయంతి సందర్భంగా ఆ మహనీయుడి విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆగస్టు 18న సాయంత్రం 4 గంటలకు ఆవిష్కరించనున్నారని తెలిపారు. తెలంగాణ అమరవీరుల స్మారక జ్యోతి సమీపంలో పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గౌడ సమాజానికి దక్కిన గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. విగ్రహ ఏర్పాటుకు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి గౌడ సోదరులు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని తెలిపారు. విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, మాజీ ఎంపీ మధు యాష్కి గౌడ్‌తో పాటు బీసీ, గౌడ సంఘాల ప్రజాప్రతినిధులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక సమానత్వం, ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ ఆగస్టు 18న హైదరాబాద్‌లో జరిగే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జిల్లాలోని గౌడ సోదరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఆలయంలో దారుణం.. మైనర్పై అర్చకుడి లైంగిక వేధింపులు

హైదరాబాద్/ ఆగస్ట్ 17/జన సంఘర్షణ



హైదరాబాద్: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. రామచంద్రాపురంలోని ఓ ఆలయంలో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఆలయ ప్రాంగణంలో బాలికతో ఓ వృద్ధుడు... అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న విషయాన్ని స్థానికులు గుర్తించారు. ఆలయానికి బయట నుంచి తాళం వేసి ఉండగా, లోపల బాలికతో అనుచితంగా ప్రవర్తిస్తున్న పూజారిని స్థానికులు పట్టుకున్నారు. ఆలయంలో అర్చకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సాయన్న అనే వృద్ధుడి బాగోతాన్ని స్థానికులు బట్టబయలు చేశారు. గ్రామ పెద్దలు, స్థానికులు కలిసి అతడిని రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అదే సమయంలో ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై కూడా స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెలుగులోకి రావాల్సి ఉంది. మైనర్ బాలికకు సంబంధించిన గుర్తింపు వెల్లడించలేదు.

## మానవత్వం చాటుకున్న సదాశివనగర్ పోలీసులు

- 30 నిమిషాల్లో స్పందించి వృద్ధురాలికి రూ.3,500 నగదు తిరిగి అందజేత

సదాశివనగర్, ఆగస్టు 17 (జన సంఘర్షణ -- కామారెడ్డి బ్యూరో):




ప్రజలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్న సదాశివనగర్ పోలీసులు మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. తన కుమారుడు తన అనుమతి లేకుండా బలవంతంగా రూ.3,500 నగదు తీసుకెళ్లాడని ఓ తల్లి డయల్-100కు ఫోన్ చేయగా, పోలీసులు కేవలం 30 నిమిషాల్లో స్పందించి నగదును తిరిగి ఆమెకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. ..సదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సదాశివనగర్ గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు తన కుమారుడు తన అనుమతి లేకుండా రూ.3,500 నగదు తీసుకుని వెళ్లిపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న వెంటనే పీసీ 2963 సీహెచ్ వినయ్ రెడ్డి, హెచ్‌జీ 530 స్వామి సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. అనంతరం కుమారుడి కోసం గాలింపు చేపట్టిన పోలీసులు సదాశివనగర్ బస్టాండ్ సమీపంలో అతడిని గుర్తించారు. అతని వద్ద ఉన్న రూ.3,500 నగదును స్వాధీనం చేసుకుని బాధితురాలికి తిరిగి అందజేశారు. అలాగే ఇకపై తల్లిదండ్రుల పట్ల ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని కుమారుడిని తీవ్రంగా హెచ్చరించి వదిలిపెట్టారు. డయల్-100కు ఫోన్ చేసిన కేవలం 30 నిమిషాల్లోనే స్పందించి సమస్యను.. పరిష్కరించిన సదాశివనగర్ పోలీసుల తీరుపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. పోలీసులంటే ప్రజలకు అండగా నిలిచే వారనే నమ్మకాన్ని మరింత బలపరిచారని గ్రామస్తులు అభినందిస్తున్నారు. ప్రజలకు భరోసా.. బాధితులకు అండగా.. వేగవంతమైన పోలీస్ సేవలకు సదాశివనగర్ పోలీసుల చర్య మరో నిదర్శనంగా నిలిచింది.

# కల్యాణ లక్ష్మీ--షాదీ ముబారక్ పథకాలపై బీఆర్ఎస్ నిరసన

- బాన్సువాడలో రేపు భారీ ధర్నా.. పాల్గొననున్న బాజిరెడ్డి గోవర్ధన్, తోట ఆగన్న....

బాన్సువాడ, /ఆగస్టు 17/ (జన సంఘర్షణ):

కల్యాణ లక్ష్మీ-షాదీ ముబారక్ పథకాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాన్సువాడ పట్టణంలో మంగళవారం భారీ నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాజిరెడ్డి గోవర్ధన్, నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జి తోట ఆగన్న ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 18న మంగళవారం ఉదయం 11 గంటలకు బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అన్ని మండలాల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువత, మహిళలు, బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కల్యాణ లక్ష్మీ-షాదీ ముబారక్ పథకాలను మరింత బలోపేతం చేసి, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పథకాల అమలుపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు నిర్వహిస్తున్న ఈ నిరసనకు బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం విజ్ఞప్తి చేసింది.




# నిరుపేద కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుడి ఆపన్నహస్తం

- అయూబ్ అంత్యక్రియలకు డా. ఎం.ఏ. హకీమ్ ఆర్థిక సాయం....

పోతంగల్, ఆగస్టు 17 (జన సంఘర్షణ):

పోతంగల్ మండల కేంద్రంలో నిరుపేద మైనార్టీ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. అహ్మద్ మియా కుమారుడు అయూబ్ (45) అనూహ్యంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. చిన్నపాటి ప్రమాదానికి గురై అయూబ్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

**ఆపదలో అండగా నిలిచిన డా. హకీమ్....**

నిరుపేద కుటుంబానికి చెందిన అయూబ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న పోతంగల్ మండల పెద్దలు, బీఆర్ఎస్ నాయకుడు, సామాజిక సేవకుడు డా. ఎం.ఏ. హకీమ్ వెంటనే స్పందించారు. అయూబ్ అంత్యక్రియలకు అవసరమైన ఖర్చుల కోసం కుటుంబ సభ్యులకు తనవంతుగా ఆర్థిక సహాయం అందించి ఆపన్నహస్తం అందించారు. ఆపద సమయంలో అండగా నిలిచిన... డా. ఎం.ఏ. హకీమ్‌కు... కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేద కుటుంబానికి మానవతా దృక్పథంతో సహాయం చేయడం పట్ల స్థానికులు అభినందించారు. కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవడం ద్వారా డా. హకీమ్ మరోసారి తన సేవా భావాన్ని చాటుకున్నారని పలువురు పేర్కొన్నారు.






## రిటైర్మెంట్ డబ్బులు, ఆస్తి విషయంలో గొడవ..

- భర్తను రోకలిబండతో కొట్టి చంపిన భార్య

హుస్నాబాద్,) ఆగస్టు 17/జన సంఘర్షణ



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని హనుమాన్ నగర్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాలు కాస్తా ప్రాణాలు తీసుకునే స్థాయికి చేరడంతో భార్య చేతిలో భర్త హతమైన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. హనుమాన్‌నగర్‌కు చెందిన వెంకటేశం (61), ఆయన భార్య రాజమణి దంపతులు. వెంకటేశం ఆసిఫాబాద్‌లో కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా పనిచేస్తుండగా, రాజమణి హుస్నాబాద్‌లో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ నెలలో వెంకటేశం పదవీ విరమణ చేయాల్సి ఉండటంతో రిటైర్మెంట్ అనంతరం వచ్చే డబ్బులు, ఆస్తి విషయమై దంపతుల మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మరోసారి ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. గొడవ తీవ్రరూపం దాల్చడంతో రాజమణి రోకలిబండతో వెంకటేశంపై దాడి చేసినట్లు సమాచారం. తీవ్ర గాయాలపాలైన వెంకటేశం అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిసింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. భర్తను హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజమణిని పోలీసులు అదుపులోకి..... తీసుకుని విచారణ చేపట్టారు. కుటుంబ కలహాలే ఈ దారుణానికి కారణమా? లేక మరేదైనా అంశం ఉందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో హుస్నాబాద్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
మంగళవారం
18 ఆగస్టు 2026

## నాగుల పంచమి సందర్భంగా ఘనంగా అన్నదానం

- హిందూ బంధువులకు శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ బర్ల మధుకర్

కోటగిరి,/ ఆగస్టు 17/ (జన సంఘర్షణ):



నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని కోటగిరి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ బంధువులందరికీ నాగుల పంచమి శుభాకాంక్షలు తెలిపారు. కోటగిరి గ్రామపంచాయతీ సర్పంచ్ బర్ల మధుకర్... కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. నాగుల పంచమి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, ఆయురారోగ్యాలను తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం పట్ల భక్తులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానికులు, భక్తులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టకు నిధులు మంజూరు

సదుం గరుడ రాత్రి (జన సంఘర్షణ):



చదుములో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ఎంపీ మిథున్ రెడ్డి రెండు లక్షలు నిధులు మంజూరు చేసినట్లు మాజీ ఎంపీపీ వెంకటస్వామి తెలిపారు. సోమవారం సదుం పర్యటనలో భాగంగా ఎంపీ ని అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కమిటీ నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా ఆయన స్పందించి రెండు లక్షల మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో సీతాపతి, మల్లెల గిరిబాబు, రామాంజులు, దండు లోకనాథం, శ్రీనివాసులు, రాజన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు అదేవిధంగా ఉభయ చిత్తూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు కలిసి మదనపల్లిలో ఈనెల 23వ తేదీన రాష్ట్ర మహాసభలు జరుగుతాయని ఈ సభలకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఆహ్వాన పత్రికను అందించారు ఆయనతోపాటు మాజీ ఎంపీ రెడ్డప్పకు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి , పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డిల కు ఆహ్వానం అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘాల నాయకులు జయరాజ్ ,సలీం, అప్ప, శేషగిరి , ప్రసాద్, జాకీర్, రామయ్య,గిరీష్ కర్నాడ్, సతీష్ కుమార్, కడియాల మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు అవార్డు

సదం గరుడ ధాత్రి (జన సంఘర్షణ):



సదుం మండలంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఒక గోపాలమిత్రకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డు అందజేసింది. సదుం మండలం రెడ్డివారిపల్లెకు చెందిన చిచ్చిలి శివరామిరెడ్డికి ఈ ఆగస్టు 15న మదనపల్లెలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పశు సంవర్ధక శాఖ జెడి గుణశేఖర్ పల్లె డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావులు ఆయనకు ఉత్తమ అవార్డులు అందజేశారు. ప్రశంసా పత్రాన్ని ఇచ్చారు. ఇదే విధంగా ప్రజలకు సేవలు చేస్తూ మరింత పేరు తీసుకొనీ రావాలని వారు చెప్పారు.

## శివుడికి వెండి నామాల వితరణ

సదుం గరుడ ధాత్రి (జన సంఘర్షణ):



సదంలోని జై సీతారామ ఆశ్రమంలో ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో వెలసిన శ్రీ మృత్యుంజయ మరకత లింగేశ్వర స్వామికి వెండి నామాలను వితరణ గా ఇచ్చారు. జాంద్రపేట కు చెందిన వెంకటరమణ లక్ష్మీదేవి దంపతులు నాగుల పంచమి సందర్భంగా స్వామివారికి వెండి నామాలు అందజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి సభ్యులు మోహన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మల్ రెడ్డి, అర్చకులు వెంకటరమణ శర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

సదుం గరుడ ధాత్రి (జన సంఘర్షణ):

మండల పరిధిలోని దేవాలయాల్లో సోమవారం నాగుల పంచమి మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు ఈ సందర్భంగా సదంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో వెలసిన గరుడాల్ వారు కు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా సుబ్రమణ్య స్వామి ఆలయం వద్ద ఉన్న నాగులరాళ్ళ కు బ్రాహ్మణ వీధిలో ఉన్న నాగుల రాళ్ళకు ,ఆంజనేయ స్వామి వద్ద ఉన్న పుట్టకు భక్తులు పూజలు చేసి పాలు పోశారు.బూరగమంద పంచాయతీ శివకోన లో వెలసిన సిద్దేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

# మద్యం మత్తులో పంచాయతీ కార్యదర్శి విధులు?

- ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలు తేల్చాలని గ్రామస్తుల డిమాండ్




కోటగిరి,/ ఆగస్టు 17 /(జన సంఘర్షణ):

కోటగిరి మండలంలోని ఓ మేజర్ గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి విధుల నిర్వహణపై స్థానికంగా తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు పంచాయతీ కార్యదర్శి నిత్యం మద్యం మత్తులో విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. వివిధ పనుల నిమిత్తం పంచాయతీ కార్యాలయానికి వచ్చే గ్రామస్తులకు అధికారి వ్యవహారశైలి ఇబ్బందికరంగా మారుతోందని, దీంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవమెంత అన్నది అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

**అధికారుల హెచ్చరిక:....** ప్రభుత్వ విధుల్లో ఉన్న ఉద్యోగులు విధి నిర్వహణ సమయంలో మద్యం సేవించి హాజరుకావడం లేదా విధులకు ఆటంకం కలిగించే విధంగా వ్యవహరించడం నిబంధనలకు విరుద్ధం. ఈ నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు ఆరోపణలను సీరియస్‌గా తీసుకుని విచారణ చేపట్టి, నిజానిజాలు తేల్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పలమనేరు, ఆగస్టు 17 (జన సంఘర్షణ):



స్థానిక శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ సోమవారం మరియు నాగ పంచమి సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలను అర్చకులు కుమార్, చంద్రమౌళి శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూలతో స్వామి వారిని అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమం లో ఆలయ చైర్మన్ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ మంజునాథ్, సభ్యులు ఎంటిఆర్ ప్రసాద్, రెడ్డప్ప, బాబు, వీరప్ప, సుజాత, మోహనప్రియ తో పాటు కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం పట్ల హర్షం... గాలి మురళి నాయుడు.

తొట్టంబేడు ఆగస్టు 17 (జన సంఘర్షణ):



కూటమి ప్రభుత్వంలో రైతులకు, రైతే రాజు అన్న చంద్రన్న ప్రభుత్వం రైతులను గుర్తించి రైతులకు గరిష్టంగా గిట్టుబాటు ధరను కల్పించడం పట్ల పార్టీలకతీతంగా రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కూటమి ప్రభుత్వానికి రైతులు ధన్యవాదాలు తెలియజేస్తూ, యూరియా కొరతను యాప్ లేకుండా మరియు వరి కోత యంత్రాలు, స్ప్రేయర్లు, తార్పాలిన్ పట్టలు, వ్యవసాయ పరికరాలను డిప్ ద్వారా కాకుండా అందుబాటులోకి తెస్తే రైతులు ఆనందం వ్యక్తం చేస్తారని మాజీ మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు కోరారు. గత ప్రభుత్వంలో ఎటువంటి వ్యవసాయ పరికరాలను ఇచ్చిన చరిత్ర లేదని గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎంతో మంది రైతులకు సబ్సిడీ ద్వారా వ్యవసాయ పరికరాలను ఇచ్చిన ఘనత చంద్రబాబు నాయుడుకి, దివంగత నేత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కి దక్కిందని కొనియాడారు.

## గంటా ఊరు బీసీ కాలనీ అంగన్వాడీ భవనాన్ని పూర్తి చేయండి

- బీసీ నాయకులు,స్థానికుల డిమాండ్
- జిల్లా కలెక్టర్ కు వినతి


పలమనేరు,, ఆగస్టు 17 (జన సంఘర్షణ):



చిత్తూరు జిల్లా కలెక్టర్ కు జిల్లా బిసి ఫ్రంట్ అధ్యక్షులు పూలే గోవిందస్వామి, పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని గంటాఊరు బీసీ కాలనీకి చెందిన స్థానికులు కలసి అసంపూర్తి అంగన్వాడీ భవనం పూర్తి చేయాలని వారు సోమవారం పంపుకొన్న వినతిలో కోరారు. వివరాలు.... అక్కడి సాయిబాబా మందిరం దగ్గర అంగన్వాడి కేంద్రం 2021 బి22 సంవత్సరంలో కొత్తగా ప్రభుత్వ భవనం నిర్మిస్తూ అర్ధంతరంగా పనులు ఆపేశారు. అప్పటి నుంచి అద్దె ఇంటిలో విధిలేక నిర్వహించుచున్నారు.ఈ కేంద్రంలో చిన్నపిల్లలు సుమారు 30 మంది, గర్భిణీ స్త్రీలు 20 మంది ఉన్నారు.

## తవణంపల్లిలో 121వ మహాభారత యజ్ఞం ద్వజారోహణము

తవణంపల్లి, ఆగస్టు 17(జన సంఘర్షణ):



తవణంపల్లి మండల కేంద్రంలో తవణంపల్లి ద్రౌపతి సమేత ధర్మరాజు ఆలయంలో ఆలయ ధర్మకర్త గుడిసి మన స్వామి శెట్టి గ్రామస్తులు యువజన సంఘం పరిసర గ్రామస్తులు ఆధ్వర్యంలో 121వ మహాభారత యజ్ఞ ధ్వజారోహణము ఘనంగ ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మాట్లాడుతూ 17. 8 .2026 నుండి 7. 9 .2026 వరకు మహాభారతం గ్రామస్తుల ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు17. తేదీ సోమవారం నుండి మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రతిరోజుహరికథ కాలక్షేపం టి టి డి ఆర్టిస్ట్ జి హేమవతి భాగవతరిణి గారిచే మహాభారత హరికథ కాలక్షేపం 24. వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బకాసుర బలి బండి పై బకాసురుడు రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు 14 రోజులు రాత్రి నాటకంలో తమిళంలో నాటకదారులు ఉమామహేశ్వరి నాటిక మండలి మాదిరెడ్డిపల్లి వారిచే మేనేజర్స్ ఎం. వినాయక ,సత్యమూర్తి, కె.వి కుప్పం ఏ.మని. కే. గణేష్. వారిచే రాత్రి నాటకం జరుపబడు తుందని ఈ కథాకాలచడానికి చుట్టుపక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహాభారత యజ్ఞాన్ని విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త గుడిసి మనసామిశెట్టి గ్రామస్తులు యువజన సంఘం చుట్టుపక్క గ్రామస్తులు వారు పాల్గొనాలని కోరారు.

## పూడి, ఇలాగనూరు ఎస్టీ కాలనీలో టిడిపి నాయకులు డోర్ టు డోర్ కార్యక్రమం

తొట్టంబేడు,ఆగస్టు 17(జన సంఘర్షణ):



శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం పూడి, ఇలాగనూరు గ్రామాల పరిధిలోని ఎస్టీ కాలనీల్లో టీడీపీ ఆధ్వర్యంలో డోర్ టు డోర్ ప్రచారం టిడిపి నాయకులు సోమవారం ఉమండల టీడీపీ అధ్యక్షులు రావిళ్ల మునిరాజ నాయుడు నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని, ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు.ఈ సందర్భంగా ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలు, స్థానిక అవసరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరాలు అందిస్తూ, గ్రామస్థాయిలో టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త చురుకుగా పనిచేయాలని మునిరాజ నాయుడు సూచించారు.ప్రజలతో కలిసి ముందుకు సాగుతూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గాలి చలపతి నాయుడు, గాలి మురళి నాయుడు, వాసు నాయుడు, డి. రామానాయుడు, శంకర్ నాయుడు, జెడ్పీటీసీ మునిరత్నం, వెంకటాచలం (మాజీ జెడ్పీటీసీ), రమణారెడ్డి, పి. రాజేంద్ర, గ్రామ ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేసిన అధికారులు

సోమల, ఆగస్టు 17 (జన సంఘర్షణ):



రాబోయే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సోమల మండలంలోని వివిధ పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో జి.వి.ఎస్.వి. ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ఆయా పంచాయతీ కార్యాలయాల పరిపాలన అధికారులు పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి సౌకర్యాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు సులభంగా ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయా లేదా అనే అంశాలను అధికారులు పరిశీలించారు. భవనం పరిస్థితి, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు, గాలి, వెలుతురు తదితర ఏర్పాట్లపై వివరాలు సేకరించారు. అలాగే పోలింగ్ సిబ్బందికి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, ప్రశాంత వాతావరణం ఉండేలా అవసరమైన ఏర్పాట్లపై కూడా అధికారులు దృష్టి సారించారు. ఓటర్ల రాకపోకలకు అనుకూలంగా కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, అవసరమైన చోట అదనపు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co